ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు...

సంప్రదాయసిద్ధమైన భారత సమాజంలో వృత్తి ప్రాతిపదికగా అంతరాలు ఏర్పడ్డాయి. అవే కులవ్యవస్థకు దారితీశాయి. బ్రిటిష్–ఇండియా పాలనలో 20వ శతాబ్దం ప్రారంభం నుంచి రిజర్వేషన్ పద్ధతి మొదలైంది. 1909 మార్లేమింటో సంస్కరణలు మత ప్రభావ వర్గాల ప్రాతిపదికన రిజర్వేషన్లకు దారితీస్తే, మూడు రౌండ్ టేబుళ్ల సమావేశాల (1930, 1931, 1932) అనంతరం అప్పటి బ్రిటిష్ ప్రధాని రామ్‌సేమాక్టోనాల్డ్ కమ్యూనల్ అవార్డు ప్రకటించారు. ఇది కుల ప్రాతిపదిక రిజర్వేషన్‌కు దారితీసింది. దీనికి నిరసనగా గాంధీజీ ప్రారంభించిన అమరణ నిరాహార దీక్ష డా॥అంబేద్కర్, గాంధీల మధ్య పుణె ఒప్పందానికి దోహదపడింది (1932). ఈ ఒప్పందం ప్రకారం నిమ్నజాతుల వారికి శాసన సభల్లో రిజర్వేషన్ కల్పించారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని అంగీకరించి 1935, భారత ప్రభుత్వ చట్టంలో రాజకీయ రిజర్వేషన్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు అవకాశం కల్పించింది. అంటరానితనానికి గురయ్యే కులాలను గుర్తించి వాటిని ఒక ప్రత్యేక జాబితాగా రూపొందించారు. ఈ జాబితాలో చేర్చిన కులాలు, తెగలను షెడ్యూల్డ్ కులాలు, తెగలుగా గుర్తించారు.

భారత రాజ్యాంగంలో 341వ ప్రకరణ షెడ్యూ ల్డ్ కులాల గుర్తింపు, దీనికి సంబంధించి రాష్ట్రపతి ప్రకటన వివరిస్తుంది. అదేవిధంగా 342 ప్రకరణ మేరకు రాష్ట్రపతి షెడ్యూల్డ్ తెగలను గుర్తిస్తారు. 1950, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉత్తర్వులో సంబంధిత కులాలు, తెగలను పేర్కొన్నారు. పార్లమెంటు చట్టం ద్వారా 341(2), 342(2) ఏ కులం/తెగ/జాతినైనా జాబితా నుంచి తొలగించవచ్చు లేదా చేర్చవచ్చు. రాష్ట్రపతి ఉత్తర్వులో పేర్కొన్న కులాలను/తెగలను తొలగించడానికి, చేర్చడానికి న్యాయస్థానానికి అధికారం లేదు. ఒక రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు/తెగలుగా గుర్తింపు పొందినవారు వేరొక రాష్ట్రంలో కాకపోవచ్చు. 1981 జనాభా లెక్కల వరకు హిందూ/సిక్కులను మాత్రమే షెడ్యూల్డ్ కులాలుగా పరిగణించేవారు. 1991 జనాభా లెక్కల నుంచి బౌద్ధమతస్తులను కూడా షెడ్యూల్డ్ కులాలుగా పరిగణిస్తున్నారు. పంజాబ్‌లో ఎక్కువ మంది షెడ్యూల్డ్ కులాలవారున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం 28.85 శాతం షెడ్యూల్డ్ కులాల వారున్నారు. జాతీయ స్థాయిలో షెడ్యూల్డ్ కులాల వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, పంజాబ్‌లో అది 25 శాతం.

రాజ్యాంగ ప్రకరణ 15(1) ప్రకారం రాజ్యం కుల, మత, తెగ, లింగం, పుట్టిన స్థల ప్రాతిపదికగా ఎలాంటి వివక్ష చూపించకూడదు. అయితే 15(4) ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పౌరులకు లేదా షెడ్యూల్డ్ కులాల, తెగల అభివృద్ధికి ప్రత్యేక సదుపాయాలు కలిగించవచ్చు. ఈ నిబంధన మేరకు విద్యాసంస్థలలో వీరికి రిజర్వేషన్లు లభిస్తాయి. అలాగే 16(1) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో రాజ్యం అందరికీ సమానావకాశాలు కల్పించాలి. 16(2) ప్రకారం మత, తెగ, కుల, లింగం, పుట్టిన స్థల/నివాస స్థల ప్రాతిపదికగా ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో ఎలాంటి వివక్ష చూపించకూడదు. 16(4) ప్రకారం వెనుకబడిన తరగతుల పౌరులకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించడానికి ఎలాంటి అడ్డంకి ఉండదు. 77వ రాజ్యాంగ సవరణ చట్టం(1995) ప్రకారం షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల ఉద్యోగులకు పదోన్నతిలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ వివరణ16(4ఎ)లో ప్రస్తావించారు. 81వ రాజ్యాంగ సవరణ చట్టం (2000) ప్రకారం ఒక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల వారికి రిజర్వు చేసిన ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ఆ ఖాళీలను తర్వాత సంవత్సరాలలో భర్తీ చేయవచ్చు. ఇంద్ర సహాని కేసు(1992)లో సుప్రీం కోర్టు విధించిన రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే నిబంధన షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన ఖాళీలు పూరించే విషయంలో వర్తించదు.

330వ ప్రకరణ కింద లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు వారి జనాభా ప్రాతిపదికగా కొన్ని స్థానాలను రిజర్వు చేస్తారు. 332వ ప్రకరణ కింద రాష్ట్ర విధానసభలో వారి జనాభా ప్రాతిపదికన షెడూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కొన్ని స్థానాలు రిజర్వు చేస్తారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 60 సంవత్సరాల తర్వాత 334వ ప్రకరణ కింద రిజర్వేషన్ విధానం రద్దవుతుంది. 335వ ప్రకరణ మేరకు వీరికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించేటప్పుడు పాలనా సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. అయితే వీరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే పోటీ పరీక్షల్లో రావలసిన మార్కుల్లో పరిమితిని తగ్గించడం, ప్రమాణాలను తగ్గించడం, పదోన్నతి విషయంలో నిబంధనలను సడలించడం జరుగుతుంది. అఖిల భారత స్థాయిలో షెడ్యూల్డ్ కులాల వారికి 15 శాతం, షెడ్యూల్డ్ తెగల వారికి 7.5 శాతం రిజర్వేషన్ లభిస్తుంది. పదోన్నతిలో కూడా ఇదే శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్

340వ ప్రకరణ కింద రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడానికి ఒక కమిషన్‌ను నియమించవచ్చు. కేంద్ర ప్రభుత్వం 1953లో కాలేల్కర్ కమిషన్‌ను, 1978లో మండల్ కమిషన్‌ను నియమించింది. మండల కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం 1980లో ఆమోదించింది. 1990లో మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేశారు. ఆ మేరకు అఖిల

భారత స్థాయిలో 27 శాతం ఉద్యోగాలను రిజర్వు చేశారు. పదోన్నతి విషయంలో రిజర్వేషన్ నిబంధన వర్తించదు. ఈ విధానాన్ని న్యాయపరంగా సవాలు చేయడం జరిగింది. ఇంద్ర సహాని కేసు (1992)లో సుప్రీంకోర్టు ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ బద్ధమేనని తీర్పునిచ్చింది. అయితే 'సంపన్న శ్రేణిని' (creamy layer) రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించాలని తీర్పునిచ్చింది.

93వ రాజ్యాంగ సవరణ చట్టం (2005) 15వ ప్రకరణకు 5వ నిబంధనను చేర్చింది. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యా సంస్థల్లో (మైనారిటీ సంస్థలు మినహా) షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు ఇతర వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించారు. 15, 19 ప్రకరణలలోని అంశాలు పై నిబంధనను అమలు చేయడంలో అడ్డంకి కారాదు. ఆ మేరకు కేంద్ర విద్యాసంస్థలలో రిజర్వేషన్ చట్టం 2006 అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల వారి కోసం కేంద్ర విద్యా సంస్థలలో (ఐఐటి, ఐఐఎం, ఏఐఐఎంఎస్) అదనపు సీట్లు చేర్చాలి. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ అశోక్ కుమార్ ఠాకూర్ సుప్రీంకోర్టులో కేసు (2006) దాఖలు చేశారు. 10.04.2008న వెలువరించిన తీర్పులో సుప్రీంకోర్టు ఇతర వెనుకబడిన(ఓబీసీ) కులాల వారికి 27 శాతం సీట్లు విద్యాలయాల్లో రిజర్వు చేయడం చట్టబద్ధమేనని, అయితే సంపన్న శ్రేణిని ఈ సదుపాయం నుంచి తప్పించాలని పేర్కొంది. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ఈ విధానాన్ని సమీక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లో 50 శాతానికి మించి (ఇంద్ర సహాని కేసులో ఇచ్చిన తీర్పు) రిజర్వేషన్లు కల్పించకూడదని తీర్పు ఇచ్చింది.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. డా॥ అంబేద్కర్ అభిప్రాయంలో రిజర్వేషన్లు ఎన్ని సంవత్సరాల పాటు కొనసాగాలి?

ఎ) 10 బి) 20
సి) 60 డి) నిరవధికంగా

2.షెడ్యూల్డ్ తెగల నిర్వచ నం కింది రాజ్యాంగ ప్రకరణలో ఇచ్చారు?

ఎ) 366(22) బి) 366(23)
సి) 366(24) డి) 366(25)

3.షెడ్యూల్డ్ కులాల వారికి అఖిల భారత స్థాయిలో బహిరంగ పోటీ పద్ధతి కాకుండా మరే ఇతర పద్ధతుల ద్వారా ఎంత శాతం మేరకు ఉద్యోగాలు రిజర్వు చేస్తారు?

ఎ) 15 బి) 16.66 సి) 7.5 డి) 25.84

4. రిజర్వేషన్‌కు సంబంధించిన చట్టాలను న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించడానికి తీసుకొన్న చర్య?

ఎ) రాజ్యాంగ సవరణ బి) పార్లమెంటు చట్టం
సి) తొమ్మిదో షెడ్యూల్డ్‌లో చేర్చడం డి) ఆర్డినెన్స్ జారీ చేయడం

5. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఆంగ్లో ఇండియన్‌లకు 2010 వరకు చట్ట సభల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని విస్తరించారు?

ఎ) 76 బి) 78 సి) 79 డి) 80

6. కింది ఏ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలవారికి పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లను తొలగించారు?

ఎ) మణిపూర్ బి) అరుణాచల్ ప్రదేశ్
సి) హిమాచల్ ప్రదేశ్ డి) సిక్కిం

7. వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్ అధ్యక్షులు?

ఎ) కాలేల్కర్ బి) మండల్
సి) పూలె డి) జాదవ్

8. కింది పేర్కొన్న చారిత్రాత్మక తీర్పులో సుప్రీంకోర్టు ఇతర వెనుకబడిన కులాలకు కేంద్ర ప్రభుత్వ పదవులలో రిజర్వేషన్ చట్టబద్ధమేనని తెలిపింది?

ఎ) కేశవానంద భారతి కేసు బి) మినర్వా మిల్స్ కేసు
సి) అశోక్ కుమార్ ఠాకూర్ కేసు డి) ఇంద్ర సహాని కేసు

9. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు?

ఎ) విద్యాలయాల్లో బి) ఉద్యోగాల్లో
సి) విద్యాలయాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో
డి) విద్యాలయాల్లో, ఉద్యోగాల్లో, ప్రాతినిధ్య సభల్లో, పదోన్నతుల్లో

10.షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతిలో రిజర్వేషన్ కల్పిస్తూ కింది నిబంధన రాజ్యాంగంలో చేర్చారు?

ఎ) 16(4) బి) 16(5)
సి) 16(ఎ) డి) 16(4ఎ)

11.అత్యాచారాలకు సంబంధించిన కేసులను విచారించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలకు?

ఎ) అందుకు బాధ్యులైన వారి ఆస్తిపాస్తులు జప్తుచేసే అధికారం లేదు
బి) రాష్ట్రప్రభుత్వ అనుమతి మేరకు జప్తు చేయవచ్చు
సి) కేంద్రప్రభుత్వం అనుమతి మేరకు జప్తు చేయవచ్చు
డి) జప్తు చేయడానికి ఎవరి అనుమతి అవసరం లేదు

12.అత్యాచారాలు జరిపిన వారిమీద 'సామూహిక జరిమానా' విధించే అధికారం ఎవరికుంది?

ఎ) ప్రత్యేక న్యాయస్థానానికి బి) రాష్ట్ర ప్రభుత్వానికి
సి) కేంద్ర ప్రభుత్వానికి డి) రాష్ట్ర హైకోర్టుకు

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12
	A	D	B	C	C	B	A	D	C	D	D	B